సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 13 । ఆగస్టు । 2024



డ్రగ్ టెస్టింగ్‌లో దొరికారు..

డ్రగ్ టెస్టింగ్ కిట్ (డ్రగ్ డిటెక్షన్ టెస్టు)తో గంజాయి సేవించిన వారిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. 8లో



డెంగీతో మహిళ మృతి

ములకలపల్లి మండలం భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఓ మహిళ డెంగీ జ్వరం బారినపడి సోమవారం మృతి చెందింది. 8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతంగా మారుతుంది. మధ్యాహ్నం తర్వాత జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



స్వామి వారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీసీతారామచంద్రస్వామివారు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. భద్రాచలం రామాలయంలో తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



అధికారులకు సమస్యలు విన్నవిస్తున్న గిరిజనులు

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ, గురుకులాల్లోని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పిల్లలు పాఠశాలల నుంచి బయటకు వెళ్లకుండా గమనించాలని ఏపీఓ డేవిడ్ రాజ్ సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన అర్జీలు స్వీకరించి మాట్లాడారు. తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపించామని తెలిపారు. పోడు పట్టాలు, పట్టాల్లో పేరు మార్పు, పంట రుణాలు, సాగునీరు, తాగునీరు, మత్స్య సొసైటీల ఏర్పాటు, అనారోగ్య బాధితులకు వైద్య, ఆర్థికసాయం, వ్యక్తిగత సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగార్జునరావు, దావీద్, భాస్కర్, నరేష్, మునీర్ పాషా, శ్రీనివాస్, ఉదయ్ కుమార్, ఆదినారాయణ, ప్రమీల బాయ్, నారాయణరావు. లింగా నాయక్, హరికృష్ణ, భద్రమ్మ, సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న నిర్వాహకులు

పాల్వంచ: అంతర్జాతీయ స్థాయి చెస్ పోటీల్లో పాల్వంచ నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ప్రదీప్త ఆరాధ్య ప్రతిభ కనబర్చింది. ఇటీవల తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిలో నిర్వహించిన జైవాసవి, వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ మీట్‌లో చిన్నారి ద్వితీయ స్థానం సాధించింది. విద్యార్థినికి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్, ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ఇరుకుల రామకృష్ణలు నగదు బహుమతి, అవార్డు, సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

లాభాల వాటా ఘనత మహేంద్రదే

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు లాభాల వాటా సాధించి పెట్టిన ఘనత ఏఐటీయూసీ నేత కేఎల్ మహేంద్రదేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో మహేంద్ర 17వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా కార్మికులు లాభాల వాటాను అనుభవిస్తుంటే ముఖ్యమంత్రులు లాభాల వాటా శాతాన్ని ప్రకటిస్తూ తామేదో కార్మికులకు మేలు చేస్తున్నామని ప్రచారం చేసుకోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాష, ఏఐటీయూసీ నాయకులు దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, జి.వీరస్వామి, నగేష్ , కె.రాములు, గట్టయ్య, ఎం. లింగయ్య, ఆన్యం లక్ష్మీనారాయణ, యూసఫ్, జహీర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిని అభివృద్ధి చేస్తాం

వరల్డ్ బెస్ట్ కన్సల్టెన్సీకి పనులు అప్పగిస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మూడు నెలల్లో పెండింగ్ పనులు పూర్తి : మంత్రి జూపల్లి



కిన్నెరసాని జలాశయంలో బోటులో భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు జూపల్లి, తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్‌రాజు, పీఓ రాహుల్, ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పర్యాటక పటంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాను అద్భుతంగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సోమవారం ఆయన కిన్నెరసాని ప్రాజెక్టును సందర్శించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ... అనేక గ్రంథాల్లో, కావ్యాల్లో కిన్నెరసాని ప్రస్తావన ఉందని తెలిపారు. చుట్టూ పచ్చని చెట్లు, మధ్యలో విశాలమైన నీటి వనరులతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందేందుకు కిన్నెరసాని ప్రాజెక్టుకు అన్ని రకాలుగా అవకాశం ఉందన్నారు. వరల్డ్ బెస్ట్ కన్సల్టెన్సీకి కిన్నెరసాని అభివృద్ధి పనుల ప్రణాళిక రూపొందించే పనిని అప్పగిస్తామన్నారు. ఈ పనులకు సాంకేతిక ఇబ్బందులు రాకుండా ఇరిగేషన్, ఫారెస్ట్, విద్యుత్, పర్యాటకంతో పాటు ఇతర శాఖలను సమన్వయం చేస్తామన్నారు.

మూడు నెలల్లో ప్రారంభం

పర్యాటకానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాను పర్యాయ పదంగా మారుస్తామని రాష్ట్ర టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఎనిమిది టీఎంసీల సామర్థ్యంతో దీవులతో కిన్నెరసాని జలాశయం అద్భుతంగా ఉందన్నారు. ఇక్కడ పర్యాటక రంగం అభివృద్ధిపై అంచనాలు రూపొందించి పంపితే, నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల వారీగా ప్రతిపాదనలు ఇచ్చారని, వాటిని పరిశీలిస్తామన్నారు. అవకాశాన్ని బట్టి ఎకో, వాటర్, వెడ్డింగ్ డెస్టినేషన్, రిక్రియేషన్ తదితర విభాగాల్లో టూరిజాన్ని ఈ జిల్లాలో ప్రమోట్ చేస్తామన్నారు. ఇక కిన్నెరసాని, కొత్తగూడెంలో ఇల్లెందు క్రాస్‌రోడ్ దగ్గర ఆగిపోయిన టూరిజం నిర్మాణాలను రాబోయే మూడు నెలల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జింకల పార్కు

కిన్నెరసాని అభయారణ్యంలో ఉన్న జింకల పార్కును విస్తరణ చేపట్టడం ద్వారా రాష్ట్రంలోనే అతిపెద్ద జింకల పార్కుగా ఏర్పాటు చేయవచ్చని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కిన్నెరసానిలో తీగల వంతెన, ట్రెక్కింగ్‌లను ఏర్పాటు చేయాలని పర్యటక శాఖ మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మట్టా రాగమయి, జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావులతో పాటు కలెక్టర్ జితేశ్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, టూరిజం జీఎం హోటల్స్ నాథన్ కట్టి, టూరిజం డీఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా

కిన్నెరసాని కాటేజీలు, అద్దాలమేడ, ఇల్లెందు క్రాస్‌రోడ్ దగ్గర బడ్జెట్ హోటళ్ల మీద సమీక్ష ఉంటుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. ఈ రెండు చోట్ల 80కి పైగా కాటేజీలు, బార్, కన్వెన్షన్ సెంటర్, ఫుడ్ కోర్టులు ఎనభై శాతానికి పైగా పనులు పూర్తైన తర్వాత అర్ధంతరంగా ఆగిపోయాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పనులు త్వరగా ముందుకు సాగుతాయని ఆశించారు. అయితే ఈ రెండు చోట్ల మొక్కుబడిగా మంత్రులు, రాబోయే మూడు నెలల్లో వీటిని అందుబాటులోకి తెస్తామని హామీతో తేల్చేశారు. సుమారు రెండు గంటలకు పైగా బోటింగ్‌లోనే మంత్రులు ఉండిపోవడంతో దాని ప్రభావం మిగిలిన కార్యక్రమాలపై పడింది.

'సమాచార'లోపం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పర్యాటక మంత్రి కృష్ణారావులు సోమవారం జిల్లాలో చేపట్టిన పర్యటనలో అడుగడుగునా సమాచార లోపం ఎదురైంది. మంత్రులు ఎప్పుడు ఎక్కడికి వస్తారో, ఏ ప్రాంతాన్ని సందర్శిస్తారో అనే సమాచారం తెలియక ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు తికమక పడ్డారు. మంత్రులను కలిసేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలు గంటల తరబడి ఎండలో ఎదురు చూస్తూ ఉండిపోయారు. అంతకు ముందు భద్రాచలంలో ప్రసాద్ పథకం పనులను సందర్శిస్తారని సమాచారం ఇచ్చి, ఆ కార్యక్రమాన్ని రద్దు చేశారు.

స్పీడ్ బోట్‌లో తుమ్మల

జలాశయంలో సమీక్ష ముగిసిన తర్వాత మధ్యాహ్నం 3:20 గంటల సమయంలో స్పీడు బోటు ఎక్కి మంత్రి తుమ్మల వెనక్కి వచ్చారు. ఆ తర్వాత మరో అరగంటకు పైగా ఇతర మంత్రులు అక్కడే ఉన్నారు. మీడియాతో మాట్లాడే సందర్భంలో కిన్నెరసామి, స్వామి.... కిన్నెరసాని ప్రాజెక్టు అని మంత్రి జూపల్లి అన్నారు. బోటింగ్ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి బ్లాక్ కూలింగ్ గ్లాస్ ధరించారు. లోకేషన్ బాగున్న చోట తన ఫోన్‌తో ఫొటోలు తీస్తూ కనిపించారు.

లైఫ్ జాకెట్లు వేసుకోలేదు..

పర్యాటక ప్రాంతాల్లో ముఖ్యంగా జలాశయాల దగ్గర రక్షణ చర్యలు తీసుకోవాలని ఇటు మంత్రులు, అటు జిల్లా అధికారులు పదేపదే చెబుతుంటారు. కానీ సోమవారం కిన్నెరసాని పర్యటన సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులతో పాటు ఎమ్మెల్యేల వరకు ఏ ఒక్కరూ రక్షణ సూత్రాలు పాటించలేదనే విమర్శలు వచ్చాయి. వీఐపీల రాకను దృష్టిలో ఉంచుకుని బోటులో లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచారు. లైఫ్ జాకెట్లకు మరకలు లేకుండా జాగ్రత్తలు కూడా తీసుకున్నారు. అయినా ఎవరూ లైఫ్ జాకెట్లు ధరించకపోవడం విమర్శలకు తావిచ్చింది. సుమారు రెండు గంటలకు పైగా నిండుకుండలా ఉన్న జలాశయం మధ్యలో ఉన్నా.. లైఫ్ జాకెట్లు వేసుకోవడంపై ఎవరూ ఆసక్తి చూపలేదు. ఇక ఏజెన్సీలో మంత్రుల పర్యటన పేరిట విపరీతమైన ఆంక్షలతో స్థానికులను ఇబ్బంది పెట్టిన పోలీసులు, వీఐపీల చేత లైఫ్ జాకెట్లు ధరింపచేయడంపై దృష్టి పెట్టకపోవడం కొసమెరుపు.



జలాశయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు



కిన్నెరసానిలో విహరిస్తున్న మంత్రులు, కలెక్టర్ తదితరులు

భారీ బందోబస్తు నడుమ..

పాల్వంచరూరల్: మంత్రుల కిన్నెరసాని పర్యటనకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతోపాటు గతంలో నక్సల్స్ కదలికలు ఉన్న ప్రాంతం కావడంతో పకడ్బందీగా బందోబస్తు చర్యలు చేపట్టారు. సోమవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డితోపాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు పర్యటించారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కిన్నెరసాని పర్యటన సాగింది. ఎస్పీ రోహిత్‌రాజు ఆధ్వర్యంలో వందల సంఖ్యలో సివిల్ పోలీసులు, స్పెషల్ పార్టీ బలగాలు, గ్రేహౌండ్స్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వర్తించారు. డీఎస్పీ సతీష్‌కుమార్, సీఐ వినయ్‌కుమార్ పర్యవేక్షించారు. మంత్రులు అద్దాలమేడ, కాటేజీల పరిశీలనకు వెళ్లినప్పుడు పాత్రికేయులు వెళ్లకుండా పోలీసులు నిలిపివేశారు. మంత్రుల వాహనాలు మినహా ఇతర నాయకులు, అధికారుల వాహనాలను కిన్నెరసాని ప్రధాన గేటు వద్దే నిలిపివేయడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు బారులుదీరాయి. మంత్రులకు వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బాబు స్వాగతం పలికి జలాశయంలోని ఐలాండ్ దృశ్యంతో కూడిన జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, మట్టా రాగమయి, అటవీ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎంకు జ్ఞాపిక అందిస్తున్న వైల్డ్ లైఫ్ ఎఫ్‌డీఓ బాబు

హరిత హోటల్ పనుల పరిశీలన

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న హరిత హోటల్ పనులను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పరిశీలించారు. మూడు నెలల్లో హరిత హోటల్ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అంతిమ శ్వాస విడిచినా.. మరొకరికి ఆయుష్షు పోశారు..

ఓ రైతు.. మరో టీవీ మెకానిక్.. ఇంకో మహిళ.. ప్రమాదంలోనో, అనారోగ్యంతోనో మృతి చెందినా మరికొందరికి ప్రాణం పోశారు. అవయవదానం చేసి చిరస్మరణీయులుగా మిగిలారు. జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించడంతో వారి కుటుంబ సభ్యులు కూడా దొడ్డ మనసుతో అంగీకరించారు. అందరికీ ఆదర్శంగా నిలిచారు. నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా అలాంటి త్యాగశీలుర గురించి తెలుసుకుందాం.

–సుజాతనగర్ 8లో



అవయవ దాత, చండ్రుగొండ మండలం టేకులబంజరకు చెందిన రైతు పల్లె వెంకన్నగౌడ్ కుటుంబ సభ్యులను అభినందిస్తున్న జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు

కేసుల విచారణలో జాప్యం చేయొద్దు

గ్రీవెన్స్ డేలో ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: పోలీసులు కేసుల విచారణలో జాప్యం చేయొద్దని, బాధితులకు న్యాయం చేసేందుకు బాధ్యతతో పని చేయాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. సోమవారం కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాయలంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. పలువురు బాధితులు అందించిన వినతిపత్రాలు స్వీకరించారు. తనను, తన భర్తను పిల్లలు మూడేళ్లుగా పట్టించుకోవడం లేదని ఓ బాధితురాలి వాపోయింది. ఇటీవల చోరీ జరిగి సొత్తు అపహరించారని, సొమ్ము రికవరీ చేసి అందించాలని మరో బాధితురాలు కోరింది. ఆయా పోలీస్ స్టేషన్లలో తమ ఫిర్యాదులపై జాప్యం జరుగుతోందని ఇంకో నలుగురు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్లకు ఫోన్‌లో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో విచారణలో జాప్యం చేయకుండా బాధితులకు న్యాయం చేకూర్చాలని అన్నారు.

15న సీఎం రేవంత్‌రెడ్డి రాక

సీతారామ పంప్‌హౌస్–2 ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 15న జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సీఎం పర్యటన షెడ్యూల్ విడుదలైంది. గోల్కొండ కోటలో స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న తర్వాత ఉదయం 11:15 గంటలకు సీఎం బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 11:45 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి ములకలపల్లి మండలం పూసుగూడెం వస్తారు. ఇక్కడ సీతారామ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో భాగంగా పంప్‌హౌస్–2లో మోటార్లను ఆన్ చేస్తారు. గత ఆదివారం ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇక్కడ ట్రయల్ రన్ నిర్వహించిన విషయం విదితమే.

అంచనాకు మించి వర్షం

- ఈ సీజన్‌లోని మూడు నెలల్లోనూ అంతే
- 96శాతం దాటిన వానాకాలం పంటల సాగు
- లక్ష్యాన్ని దాటిన మొక్కజొన్న, పత్తి, ఆయిల్‌పామ్



వరిపొలం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. 20 మండలాల్లో అధికవర్షపాతం నమోదుకాగా, మూడు మండలాల్లో మాత్రం సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో వానాకాలం సీజన్‌లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 4,71,622 ఎకరాలు కాగా ఇప్పటివరకు 4,52,402 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. పంటల సాగు 96 శాతంగా నమోదైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోపక్క వరి సాగు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,60,332 ఎకరాలు కాగా ఇప్పటివరకు 75,824 ఎకరాలలో సాగు చేపట్టారు. గడచిన 15 రోజుల్లో వరి విస్తీర్ణం 47 శాతానికి చేరుకుంది. వర్షాలు తగ్గుముఖం పడుతుండటంతో ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. పత్తి సాధారణ విస్తీర్ణం 1,56,212 ఎకరాలు కాగా అంచనాకు మించి 1,98,268 ఎకరాల్లో రైతులు వేశారు. పంట సాగు 126 శాతంగా నమోదైంది. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 41,503 ఎకరాలు కాగా 57,062 ఎకరాల్లో సాగు చేస్తుండగా 137 శాతం నమోదైంది. ఆయిల్‌పామ్ 37,053 ఎకరాలు లక్ష్యం సాధారణం కాగా ఏకంగా 64,436 ఎకరాలలో సాగు చేస్తున్నారు. 174 శాతం పంట నమోదైంది.

865.3 మి.మీ వర్షపాతం

జూన్ మాసంలో 164.4 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా 227.6 మి.మీ వర్షపాతం కురిసింది. జూలై మాసంలో 302.5 మి.మీ సాధారణ వర్షపాతం కాగా 483.3 మి.మీ కురిసింది. ఆగస్టులో ఇప్పటివరకు 85.1 మి.మీ సాధారణ వర్షపాతం కాగా 154.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు మొత్తంగా 552.1 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 865.3 మి.మీ వర్షపాతం నమోదైంది. చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, ఇల్లెందు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మిగిలిన 20 మండలాల్లోనూ అధిక వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అధిక వర్షాలతో ఆందోళనగా ఉండేది



వర్షాలు పెరగడంతో వ్యవసాయ పనులు ముమ్మరం చేశాం. అయితే అధిక వర్షాలు ఆందోళన కలిగించాయి. వర్షం తగ్గుముఖం పడితే బాగుంటుందని అనుకున్నాం. ఇప్పటివరకైతే పత్తికి రేగడి నేలల్లో ఇబ్బంది. మెట్ట నేలలకు సానుకూలం.

– వాంకిడోత్ కోబల్, బావోజితండా, రేగళ్ల

సాగు 96 శాతం పూర్తి



జిల్లాలో వానాకాలం సాగు 96 శాతం పూర్తయింది. వర్షాలు బాగా కురుస్తుండడంతో రైతులు సాగును ముమ్మరం చేయడం వల్ల సాగు విస్తీర్ణం ఊపందుకుంది. పంటలు నష్టపోకుండా రైతులు సమీపంలోని వ్యవసాయాధికారుల సూచనలను పాటించాలి.

– బి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

నేడు శ్రీనివాసరావు స్మృతివనానికి శ్రీకారం



స్మృతివనం నిర్మించే ప్రాంతం

చండ్రుగొండ : గొత్తి కోయల చేతిలో హతమైన రేంజర్ చలమల శ్రీనివాసరావు స్మృతివనం ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. 2022, నవంబర్ 22న చండ్రుగొండ ఫారెస్ట్ రేంజి అధికారి చలమల శ్రీనివాసరావు హత్యకు గురయ్యారు. రెండేళ్లపాటు ఇక్కడ పనిచేసిన ఆయన అడవుల రక్షణకు ఎనలేని కృషి చేశారు. స్మగ్లర్లు, అక్రమ పోడుదారుల ఆటకట్టించారు. అటవీ ప్రాంతంలో అరుదైన ఔషధ మొక్కల పెంపకానికి కృషి చేశారు. పోడుసేద్యం పేరిట అడవులను నాశనం చేయొద్దంటూ అవగాహన కల్పిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలో ఆయన హత్యకు గురికాగా అప్పట్లో రాష్ట్రంలోనే సంచలనంగా మారింది. శ్రీనివాసరావుకు గౌరవంగా కనకగిరి అటవీప్రాంతంలోని పోకలగూడెం బీట్ రావికంపాడు సెక్షన్‌లో 25 ఎకరాల విస్తీర్ణంలో స్మృతివనం ఏర్పాటుకు మంగళవారం శ్రీకారం చుట్టనున్నట్లు ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఎఫ్‌డీఓ స్మృతివనం పనులను పరిశీలించి, విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్మృతివనంలో 16,666 మొక్కలను నాటుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీసీఎఫ్ భీమానాయక్‌తోపాటు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగానికి గడల రాజీనామా

శ్రీనివాసరావు వీఆర్‌ఎస్‌ను ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు ప్రభుత్వ సర్వీసుల నుంచి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. తనకు వీఆర్‌ఎస్ ఇవ్వాల్సిందిగా ఇప్పటికే ప్రభుత్వానికి ఆయన రెండు సార్లు దరఖాస్తు చేసుకున్నారు. చాలా కాలం పాటు గడల విజ్ఞప్తిని పెండింగ్‌లో ఉంచిన రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఆమోదించింది. ఈ నెల 8 నుంచి ఆయన వీఆర్‌ఎస్ అమల్లోకి వస్తున్నట్టుగా పేర్కొంది. జిల్లాకు చెందిన గడల శ్రీనిసవారావు ప్రభుత్వ వైద్యుడిగా కెరీర్ ప్రారంభించి, అంచెలంచెలుగా హెల్త్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు.

ఫలించని రాజకీయ కలలు

కరోనా విపత్తు సమయంలో హెల్త్ డైరెక్టర్ హోదాలో గడల శ్రీనివాసరావు విధులు నిర్వర్తించారు. కరోనా కట్టడికి తీసుకున్న చర్యలతో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి చూపించారు. తన తండ్రి పేరున ట్రస్ట్ స్థాపించి కొత్తగూడెంలో సేవా కార్యక్రమాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే మాజీ సీఎం కేసీఆర్‌కు పాదాభివందనం చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చివరకు ఆ పార్టీ నుంచి టికెట్ దక్కలేదు. గతేడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గడల లాంగ్ లీవ్ పెట్టారు. మధ్యలో ఖమ్మం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు దరఖాస్తు చేసినా ఆయన రాజకీయ కలలు ఫలించలేదు. మరోవైపు డీహెచ్ బాధ్యతల నుంచి కాంగ్రెస్ సర్కారు తప్పించి మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేసింది.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

పాల్వంచరూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకుంటానని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. మండలంలోని ఉల్వనూరులోని గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఐదు రోజులుగా విధులకు హాజరు కాని యూడీసీ బుచ్చయ్యకు మెమో జారీ చేశారు. ఇంటింటి సర్వేలు నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలన్నారు. డాక్టర్ తేజశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

టేబుల్ టెన్నిస్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



అండర్-15 బాలుర విభాగంలో విజేతలుగా నిలిచిన ఖమ్మం క్రీడాకారులతో నిర్వాహకులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని జీఎస్ అకాడమీ ఆధ్వర్యాన రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. అండర్-12, 15 బాల బాలికలతో పాటు పురుషుల, మహిళల విభాగంలో పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో అండర్-12, 15 బాలుర విభాగాల్లో ఖమ్మం క్రీడాకారులు చాంపియన్‌గా నిలిచారు. అలాగే, పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో కొత్తగూడెం క్రీడాకారులు ట్రోఫీ కైవసం చేసుకున్నారు. విజేతలకు టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.శరత్‌కుమార్ తదితరులు బహుమతులు ట్రోఫీలు, పతకాలు అందజేశారు.

అటవీ భూమి స్వాధీనం

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధి కమలాపురం శివార్లలో కొందరు అటవీ భూమిని ఆక్రమించుకున్నారనే సమాచారంతో సోమవారం అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కమలాపురం శివారు అటవీ భూమిలో కొందరు చెట్లు నరికి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపారు. అక్కడ తాత్కాలికంగా నిర్మాణాలు చేపడుతుండగా అటవీ అధికారులు వాటిని తొలగించారు. అయితే, అటవీ అధికారులు కొందరికి అనుమతి ఇచ్చి.. మిగతా వారిపై జులుం ప్రదర్శిస్తున్నారని పలువురు ఆరోపించడంతో వాగ్వాదం జరిగింది. అయితే, స్వాధీనం చేసుకున్న స్థలంలో మొక్కలు నాటనున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు.

బియ్యం నూకగా మార్చి రవాణా..?

అశ్వాపురం: రేషన్ బియ్యంతో అక్రమ దందా చేస్తున్న వ్యాపారులు కొత్త పంథాకు తెరలేపారు. రేషన్ బియ్యం పట్టుబడే అవకాశం ఉండటంతో బియ్యాన్ని నూకగా మార్చి అక్రమంగా తరలిస్తున్నారు. రేషన్ బియ్యం ఎక్కువగా పౌల్ట్రీ, లిక్కర్, అయిల్ పరిశ్రమలు, హోటళ్లలో వినియోగిస్తున్నారు. నూకలైతే పౌల్ట్రీ, ఇతర జంతువుల ఫీడ్ కోసం అనుకొని వదిలేస్తారని బియ్యాన్ని మిల్లుల్లో నూకగా మార్చి పొరుగు రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఈ రేషన్ బియ్యం దందాపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లైన్‌మెన్‌ను నిలదీసిన రైతులు

టేకులపల్లి: మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్‌లో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి గ్రామం మీదుగా వెళ్తున్న లైన్‌మెన్ దేవ్‌సింగ్‌ని అడ్డుకుని పదే పదే కరెంట్ ఎందుకు తీస్తున్నారని ప్రశ్నించారు. ఈ క్రమంలో లైన్‌మెన్‌కి, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. లైన్‌మెన్‌ను వివరణ కోరగా మరమ్మతులు, అభివృద్ధి పనుల కారణంగా అప్పుడప్పుడు విద్యుత్ సరఫరా ఉండటం లేదని, రోజంతా తీయడం లేదని సమాధానం చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అశ్వారావుపేటరూరల్/పాల్వంచ: అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను సోమవారం పోలీస్, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా పట్టుకున్నారు. అశ్వారావుపేట మండలంలోని ఖమ్మంపాడు వాగు నుంచి అక్రమంగా రవాణా చేస్తుండగా అశ్వారావుపేట శివారులో ఎస్‌ఐ శివరామకృష్ణ రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. మరో ట్రాక్టర్‌ను స్థానిక ఆర్‌ఐ కృష్ణ పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వారు తెలిపారు. అలాగే, పాల్వంచలోని మొర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బొల్లేరుగూడెం వద్ద ఎస్‌ఐ రాఘవయ్య ఆధ్వర్యాన స్వాధీనం చేసుకుని డ్రైవర్ కిరణ్, యజమాని నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశారు.

గోదావరిలో వివాహిత మృతదేహం లభ్యం

బూర్గంపాడు: ఈ నెల 5వ తేదీన బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సారపాక గాంధీనగర్‌కు చెందిన భూక్యా శైలజ (20) మృతదేహం సోమవారం లభ్యమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో శైలజ గోదావరిలో దూకిన విషయం విదితమే. ఆమె కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు వారం రోజుల పాటు ముమ్మరంగా గోదావరిలో గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. కుక్కునూరు మండలం దామరచర్ల సమీపంలో సోమవారం ఓ మహిళ మృతదేహం గోదావరి ఒడ్డున చెట్టుకు వేలాడుతుండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. శైలజ కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. గుర్తు పట్టలేనివిధంగా మృతదేహం పాడైంది. అయితే మృతదేహంపై ఉన్న కొన్ని ఆధారాలతో అది శైలజ మృతదేహంగా కుటుంబ సభ్యులు నిర్ధారణకు వచ్చారు. ఈ విషయమై ఎస్‌ఐ రాజేశ్‌ను వివరణ కోరగా కుక్కునూరు మండలంలో గోదావరిలో లభ్యమైన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వైద్యుల నివేదికల ఆధారంగా నిర్ధారణ చేస్తామని తెలిపారు.

అంతిమ శ్వాస విడిచినా.. మరొకరికి ఆయుష్షు పోశారు..

మనిషికి ఒకటే జన్మ.. కానీ మనిషి అవయవాలకు మాత్రం రెండు జన్మలు!

అవయవదానం చేస్తే మరణించినా మరో రూపంలో జీవించే అవకాశం ఏర్పడుతుంది. ఎవరైనా కన్నుమూసినప్పుడు సరైన సమయంలో గుండె, మూత్రపిండాలు, ప్యాంక్రియాస్, ఊపిరితిత్తులు, కాలేయం, చేతులు, ముఖం, కణజాలం, ఎముకమజ్జ, మూలకణాలు సేకరించగలిగితే మరో ఎనిమిది మంది ప్రాణాలు కాపాడొచ్చు. ఈ అవయవాలు పొందే దాతలు ముందుకు రాక ఎందరో ఎదురుచూపుల్లో గడుపుతున్నారు. మరికొందరు ఫలితం లేక కన్నుమూస్తున్నారు. ఈ నేపథ్యాన వివిధ సంస్థలు, వ్యక్తులు కల్పిస్తున్న అవగాహనతో ఇటీవలి కాలంలో అవయవదానానికి పలువురు ముందుకొస్తున్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల కుటుంబీకులకు అవగాహన కల్పించడం ద్వారా వారు తమ కుటుంబీకుల అవయవదానానికి సిద్ధమవుతున్నారు. ఈ అంశం తెలిసిన ఇంకొందరు ముందుగానే ఒప్పంద పత్రాలు ఇస్తున్నారు. అయితే, మరణాల సంఖ్యకు తగినట్లుగా అవయవదాతలు లేక పలువురి జీవితం అర్ధంతరంగా ముగుస్తోంది. ఈ నేపథ్యాన నేడు (మంగళవారం) ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో అవయవ దానం చేసి స్ఫూర్తిగా నిలిచిన పలువురిపై కథనం.

–సుజాతనగర్



- అవయవదానంతో ఇంకొందరికి ప్రాణదానం
- ఉమ్మడి జిల్లాలో నానాటికీ పెరుగుతున్న అవగాహన
- ముందుకొస్తున్న పలు కుటుంబాలు
- నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

టీవీ మెకానిక్.. పెద్దమనస్సు



కుమారస్వామి

అశ్వాపురానికి చెందిన బేతి కుమారస్వామి (51) టీవీ మెకానిక్. ఓరోజు బాత్‌రూంలో కుప్పకూలగా కుటుంబీకులు కొత్తగూడెం, ఖమ్మం ఆపై హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఆయన బ్రెయిన్ డెడ్ అయిందని ప్రకటించగా.. అంతా బాగున్న అవయవాల దానంపై అవగాహన కల్పించారు. దీంతో కుటుంబీకులు ముందుకు రాగా అవయవాలు సేకరించి అవసరమైన వారికి అమర్చారు.

అందరి అంగీకారంతో..



మరికుక్కల ఎలేంద్ర

మణుగూరులోని శివాజీనగర్‌కు చెందిన మరికుక్కల ఏలేంద్ర (53)కు నాలుగు నెలల కిందట బ్రెయిన్ స్ట్రోక్ రాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. కోమాలోకి వెళ్లిన ఆమెను వివిధ ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం కానరాలేదు. బ్రెయిన్ డెడ్ అయినందున అవయవాలు దానం చేయాలని జీవన్‌దాన్ ప్రతినిధులు సూచించారు. కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఈమె కళ్లు, లివర్, గుండె, కిడ్నీలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంతో..



పల్లె వెంకన్నగౌడ్

చంద్రుగొండ మండలం టీకులబంజరకు చెందిన రైతు పల్లె వెంకన్నగౌడ్ (52) కన్నుమూసినా ముగ్గురి జీవితాల్లో వెలుగు నింపాడు. కంటి పరీక్షల నిమిత్తం పాల్వంచ వెళ్తుండగా కారు ఢీకొనడంతో గాయపడిన ఆయనను హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ ప్రతినిధులు అవగాహన కల్పించి వెంకన్నగౌడ్ శరీరం నుంచి కాలేయంతో పాటు, రెండు కళ్లను సేకరించారు.

వృద్ధురాలు.. స్ఫూర్తి



పెద్ది కొమరమ్మ

గరీబ్‌పేట గ్రామపంచాయతీ పరిధి లక్ష్మీపురం తండాకు చెందిన పెద్ది కొమరమ్మ (76) గత నెల 16న ఆస్పత్రికి వెళ్తుండగా ఆటో ఢీకొట్టింది. ఆమె తలకు బలమైన గాయం కాగా, సింగరేణి ఆస్పత్రిలో.. అక్కడి నుంచి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా ఫలితం లేక బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవదానంపై వైద్యులు ఆమె కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఆపై మూత్రపిండాలు, కాలేయం సేకరించారు.

కన్నబిడ్డను కాపాడుకోవాలని..



కుమార్తెతో తల్లి భద్రమ్మ (ఫైల్)

సుజాతనగర్‌కు చెందిన బోడా హరినాయక్, భద్రమ్మ దంపతుల పెద్ద కుమార్తె స్నేహిత 12 ఏళ్ల వయసులో అనారోగ్యంతో కోమాలోకి వెళ్లింది. ఆమె రెండు కిడ్నీలు పనిచేయడం లేదని.. దాతలు దొరికితే కిడ్నీ మార్చాలని చెప్పారు. అది తప్ప మరో మార్గం లేదని తెలిపారు. దీంతో తల్లి భద్రమ్మ తన కిడ్నీ అందించింది. అయితే, కొన్నాళ్లు బాగానే ఉన్నా స్నేహిత ఆ తర్వాత పరిస్థితి విషమించి కన్నుమూసింది.

మరికొందరికి ప్రాణం



వనమా లీలావతి

కన్నుమూసినా నలుగురికి ఉపయోగపడ్డారు తల్లాడ మండలానికి చెందిన వనమా లీలావతి (65). గత ఏడాది ఆమె వెళ్తున్న బస్సును లారీ ఢీకొనగా గాయపడింది. ఆమెను హైదరాబాద్ తీసుకెళ్లేసరికి బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. అవయవదానంపై జీవన్‌దాన్ ప్రతినిధులు లీలావతి కుటుంబానికి వివరించగా స్పందన వచ్చింది. ఆమె నుంచి కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలను సేకరించి అవసరమైన వారికి అమర్చారు.

రక్తంలో ఇన్‌ఫెక్షన్‌తో...



రామాల స్వరూపారాణి

ఖమ్మంకు చెందిన రామాల స్వరూపారాణి (47) కాళ్లపై మచ్చలు ఏర్పడటంతో మందులు వాడుతోంది. ఈ క్రమంలోనే గత ఏడాది ఆమె ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యారు. పరీక్షించిన వైద్యులు రక్తంలో ఇన్‌ఫెక్షన్ సోకి బ్రెయిన్‌కు చేరి డెడ్ అయినట్లుగా నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ ప్రతినిధులు స్వరూపారాణి కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. అవయవదానానికి వారు అంగీకరించడంతో కళ్లు, గుండె, కిడ్నీలు సేకరించారు.

ఏజెన్సీలో వెనుకబడింది ఎస్సీ కులాలే..



అభివాదం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధిలో వెనుకబడింది ఎస్సీకులాలేనని ఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గుగ్గిళ్ల పీరయ్య అన్నారు. సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వేషన్ అమలు చేయాలని, తెలంగాణ ఏర్పడ్డాక ఏజెన్సీలో ఎస్సీ కులాలకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంతోటి నాగేశ్వరరావు, ధన్‌రాజ్, మ్యాచెస్, జానకీరావు, గొడ్ల మోహన్‌రావు, మోరే రమేశ్, సలిగంటి శ్రీనివాస్, మోదుగు జోగారావు, ఎనుగంటి కృపాకర్, చదలవాడ సూరి, ఇనుముల వెంకటేశ్వర్లు, మారపాక రమేశ్, వేల్పుల భాస్కర్, కత్తి బాలకృష్ణ, కండె రాములు, సలిగంటి కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా వీరస్వామి



ఎం.వీరస్వామి

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం.వీరస్వామికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ హన్మంతరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న ఏ.సులోచన ఇటీవల నల్లగొండకు బదిలీ అయ్యారు. అదే సమయాన వరంగల్ డీసీ కార్యాలయం సూపరింటెండెంట్ ఎం.వీరస్వామిని ఉమ్మడి ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయననే ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పదేళ్లకు పైగా ఇక్కడ విధులు నిర్వర్తించిన ఆయనను ఉద్యోగులు, అర్చకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంజీవరావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్‌కాలనీ, ఆదర్శనగర్‌కాలనీల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను భద్రాచలంటౌన్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ సంజీవరావు కథనం ప్రకారం.. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన మాలోత్ విక్రమ్, ములుగు జిల్లా వాజేడు మండలానికి చెందిన జీవన్ ప్రకాష్.. భగవాన్‌దాస్‌కాలనీకి చెందిన శౌరయ్య ఇంట్లో గత నెల 24న ఆదర్శనగర్‌కాలనీకి చెందిన సూరబోయిన నాగేశ్వరరావు ఇంట్లో గత నెల 27న బంగారంతో పాటు వెండిని చోరీ చేశారు. ఈక్రమంలో మాలోత్ విక్రమ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా రెండు చోరీలు తానే చేశానని, మరో వ్యక్తి సాయం చేశాడని తెలిపాడు. ఈ క్రమంలో జీవన్ ప్రకాశ్ అలియాస్ చంటీని కూడా అదుపులోకి తీసుకుని విచారించగా 90 గ్రాముల వెండి, 80 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని, వారి వద్ద నుంచి ఆభరణాలను రికవరీ చేశామని సీఐ తెలిపారు. మాలోత్ విక్రమ్ గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలో పలు దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని సీఐ సంజీవరావు చెప్పారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన హెడ్‌కానిస్టేబుల్ సూర్యం, కానిస్టేబుల్ లక్ష్మణ్‌ను సీఐ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పీవీఎస్ రావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

డ్రగ్ టెస్టింగ్‌లో దొరికారు..

- కొత్తగూడెంలో 6.6 కేజీల గంజాయి స్వాధీనం
- వినియోగదారుల గుర్తింపు.. పరీక్షలతో అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పక్కన సీఐలు, ఎస్‌ఐ

కొత్తగూడెంటౌన్: ఇప్పటి వరకు గంజాయి తరలించే వ్యక్తులు, వారి వెనుక ఉన్న ముఠా సభ్యులే పట్టుబడుతున్నారు. కానీ, ఇప్పుడు కొత్తగా అందుబాటులోకి వచ్చిన డ్రగ్ టెస్టింగ్ కిట్ (డ్రగ్ డిటెక్షన్ టెస్టు)తో గంజాయి సేవించిన వారిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొదటిసారి గంజాయి సేవించిన వారిని అరెస్టు చేయగా వివరాలను కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వెల్లడించారు.

వాహన తనిఖీల్లో 6.6 కిలోలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో సీఐ కరుణాకర్ బృందం ఇటీవల వాహన తనిఖీలు చేపట్టగా శేషగిరినగర్‌కు చెందిన రావులపెంట మోహనకృష్ణ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. దీంతో ఆయనను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా రూ.లక్షకు పైగా విలువైన 6.6 కేజీల గంజాయి లభించింది. ఆయనను విచారించగా ఏపీలోని చింతూరు నుంచి గంజాయి తీసుకొచ్చి అమ్ముతున్నట్లు చెప్పాడు. ఇన్నాళ్లు ఎవరెవరికి అమ్ముతున్నాడో ఆరా తీయగా కొత్తగూడెం రైటర్‌బస్తీకి చెందిన బెల్లకొండ ప్రేమ్‌కుమార్, బర్మాక్యాంప్‌నకు చెందిన అమాన్, చుంచుపల్లి గాంధీకాలనీకి చెందిన ఎస్.కే.సాదిక్‌పాషా, కూలీలైన్‌కు చెందిన జంగిలి రేవంత్, రైటర్‌బస్తీ గొల్లగూడెంనకు చెందిన కంచం సందీప్‌కుమార్ పేర్లు చెప్పడంతో వారిని అదుపులోకి తీసుకుని డ్రగ్ కిట్‌తో పరీక్షలు చేయగా విషయం నిర్ధారణ అయింది. ఆపై మూత్రం, రక్తనమూనాలు కూడా సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు డీఎస్పీ తెలిపారు. ఇప్పటికే మోహనకృష్ణను రిమాండ్‌కు తరలించగా మిగిలిన ఐదుగురిని సోమవారం రిమాండ్‌కు పంపించామని చెప్పారు. ఇకనుంచి గంజాయి అమ్ముతున్న వారితోపాటు సేవించిన వారికి శిక్ష తప్పదని డీఎస్పీ రెహమాన్ హెచ్చరించారు. సమావేశంలో వన్‌టౌన్, త్రీటౌన్ సీఐలు కరుణాకర్, శివప్రసాద్, ఎస్‌ఐ విజయ పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌ల పేరుతో ప్రజల మధ్య చిచ్చు

రైతు సంఘం నేతలు సుదర్శన్, సాగర్



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

అశ్వాపురం/సుజాతనగర్: ప్రాజెక్టుల పేరుతో రెండు జిల్లాల ప్రజల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం చిచ్చు పెడుతోందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ ఆరోపించారు. సోమవారం రైతు సంఘం నాయకులు అశ్వాపురం మండలం బీజీకొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను, కెనాల్‌ను, దుమ్ముగూడెం ఆనకట్టను పరిశీలించారు. సుజాతనగర్‌లో జరిగిన సదస్సులో మాట్లాడారు. సీతమ్మ సాగర్ బ్యారేజీ పనులు పూర్తయ్యాకే సీతారామ ప్రాజెక్ట్ పనులు ప్రారంభించి రెండు జిల్లాలకు పూర్తి స్థాయిలో రైతాంగానికి సాగునీరు అందించాలని కోరారు. బ్యారేజీ పూర్తి కాకుండా సీతారామ ప్రాజెక్టుకు నీరు ఎలా వస్తుందని ప్రశ్నించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులు పూర్తి కాకుండానే హడావుడిగా ప్రారంభోత్సవానికి ప్రభుత్వం సిద్ధపడిందని ఆరోపించారు. పథకాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించాక నీటిని ఏ విధంగా విడుదల చేస్తారో ప్రకటించలేదన్నారు. ఈ కార్యక్రమాల్లో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, యలమంచిలి వంశీకృష్ణ, నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, వెంకటేశ్వర్లు, రవికుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సాంబశివరావు, సుధాకర్‌రెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



ఇల్లెందు: నిందితులు, గంజాయిని చూపుతున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న గంజాయిని సోమవారం ఆబ్కారీ పోలీసులు పట్టుకున్నారు. భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహిమున్నీసా కథనం ప్రకారం.. కూనవరంరోడ్డులోని ఆర్టీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించిన ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేయగా గంజాయి దొరికింది. ద్విచక్రవాహనంతోపాటు నిందితులను ఆబ్కారీ కార్యాలయానికి తరలించి విచారించారు. పట్టుబడిన గంజాయిని సీలేరు నుంచి మరిపెడ బంగ్లాకు తరలిస్తున్నట్లు తేలిందని సీఐ తెలిపారు. సుమారు రూ.1.50 లక్షల విలువైన 6 కేజీల గంజాయిని సీజ్ చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ సీతారామరాజు, హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌డీ ఆలీమ్, కానిస్టేబుళ్లు వీరబాబు, కోటబాబు, నాగేశ్వరరావు, లలిత, మనోహర్, సుజాత్ పాల్గొన్నారు.

ఇల్లెందులో 5.53 కేజీలు

ఇల్లెందు: ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సోదాల్లో గంజాయి తరలిస్తున్న ముఠా పట్టుబడింది. సోమవారం ఇల్లెందులో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వివరాలు వెల్లడించారు. డోర్నకల్ నుంచి ముగ్గురు వ్యక్తులు బైక్‌పై సుమారు రూ.లక్ష విలువైన 5.53 కేజీల గంజాయిని ఏపీకి తరలిస్తూ.. వాహన తనిఖీల్లో పట్టుబడ్డారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులు, గంజాయిని ఆబ్కారీ స్టేషన్‌లో అప్పగించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెల్లడించారు. రమేశ్, బాలు, సుధీర్, హరీశ్, వెంకట్, హనుమంతరావు, విజయ్ పాల్గొన్నారు.

డెంగీతో మహిళ మృతి



లీలావతి (ఫైల్)

ములకలపల్లి: డెంగీ జ్వరం బారినపడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని భగత్‌సింగ్‌నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబీకుల కథనం మేరకు.. భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన వర్కా లీలావతి (47) నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. రక్త పరీక్ష చేయగా డెంగీ సోకినట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం పరిస్థితి విషమించడంతో కొత్తగూడెం ప్రైవేట్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త రుక్మాంగధర్‌రావు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

పాల్వంచ: పురుగులమందు తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వనమాకాలనీకి చెందిన కూలి పని చేసే కోటిపల్లి సత్యప్రసాద్ (31) ఆర్థిక ఇబ్బందులు తాళలేక 11వ తేదీన మొర్రేడు వాగు వద్ద పురుగులమందు తాగి భార్య రోజాకు ఫోన్ చేసి చెప్పాడు. అక్కడికి వెళ్లిన స్థానికులు ఆయన్ను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరంతో వ్యక్తి...

కామేపల్లి: జ్వరంతో బాధపడుతూ మండలంలోని ఊట్కూర్‌కు చెందిన ఎల్లబోయిన శ్రీనివాసరావు(38) సోమవారం మృతి చెందాడు. వారం క్రితం ఆయనకు జ్వరం రాగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూనే పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

గొడ్డలి దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

బూర్గంపాడు: మండలంలోని బత్తులనగర్ గ్రామంలో మడివి సీతయ్యపై అదే గ్రామానికి చెందిన కారం వెంకటేశ్ గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. సోమవారం ఉదయం జరిగిన ఈ దాడిలో సీతయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను గ్రామస్తులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వ్యక్తిగత కక్షలతోనే దాడి జరిగినట్లు తెలుస్తోంది. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

గుండాల: ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన ఆళ్లపల్లి మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లికి చెందిన వినోద్ బైక్‌పై మర్కోడు నుంచి ఆళ్లపల్లికి.. పాతూరు గ్రామానికి చెందిన వినీత్ బైక్‌పై ఆళ్లపల్లి నుంచి పాతూరుకు వెళ్తున్నారు. తీగలంచ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆళ్లపల్లి ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు.